క్లుప్తంగా

ఏపీ ఈ-సెట్‌లో రైతు బిడ్డ ప్రతిభ



తల్లిదండ్రులతో భావన

చీడికాడ: ఏపీ ఈ–సెట్‌లో అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌లో స్టేట్ మూడో ర్యాంకు సాధించిన ఎల్.బి.పట్నానికి చెందిన గండి భావనను ఎంపీపీ కురచా జయమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు. రైతు కుటుంబంలో పుట్టిన భావన 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఈ ఘనత సాధించిందని కొనియాడారు. భావనను తల్లిదండ్రులు గోవింద, కృష్ణవేణి, తదితరులు అభినందించారు.

భారత్ బంద్ వాయిదా

రోలుగుంట: శ్రామిక విధానాల కోసం ఈ నెల 20న తలపెట్టిన భారత్ బంద్ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవింద తెలిపారు. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త కారణంగా కార్మిక సంఘాలు వాయిదా బంద్‌ను వేశాయన్నారు. శ్రామిక విధానాల్లో ప్రభుత్వాల వైఖరిలో మార్పు రావాలన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్ రూ.9 వేలు చేయాలని, తదితర డిమాండ్ల సాధన కోసం బంద్‌కు పిలుపునిచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా శ్రీనివాసరావు



మాకవరపాలెం: స్థానిక పీహెచ్‌సీ రెండో వైద్యాధికారిగా బి.శ్రీనివాసరావు నియామకమయ్యారు. ఇక్కడి పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యాధికారి శ్రీవిద్యకు ఇటీవల పీజీ సీటు రావడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. ఆమె స్థానంలో నూతనంగా శ్రీనివాసరావును వైద్యశాఖ నియమించింది. ఈ నేపథ్యంలో ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో అప్పారావు సూచించారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ఇంటింటి సర్వే చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రచారం చేయాలన్నారు. బడి బయట పిల్లలపై దృష్టి సారించాలన్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థుల కిట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జాన్‌ప్రసాద్, పి.ఎ స్.ఎస్.మూర్తి, సీఆర్‌టీలు, పార్ట్ టైం బోధకులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను మంచి మార్గంలో నడిపించాలి



ఏటిగైరంపేటలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రేవతమ్మ

గొలుగొండ: పిల్లలను సన్మార్గంలో నడిపించి మంచి భవిష్యత్తు అందేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ సూచించారు. ఏటిగైరంపేట గ్రామంలో పిల్లల భవిష్యత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని, అయితే వారు నడుచుకొనే విధానంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ఈ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని, దీనిపై ప్రతి రోజు గస్తీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పిల్లలు రోజూ ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు అన్న విషయాలు పరిశీలించాలన్నారు. చెడు మార్గంలో పయనిస్తే ఇప్పుడే మందలించాలన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్ఐ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రబీ ధాన్యం కొనుగోలు ఎక్కడ?





ప్రైవేటు వ్యాపారులకు చెందిన వ్యాన్‌కు ధాన్యం బస్తాలు లోడు చేస్తున్న రైతులు



వడ్డాది కస్పా పొలాల్లో ఆశాజనకంగా పండిన రబీ వరి పంట



కస్పా పొలాల్లో నూర్పి పోగులుగా వేసిన ధాన్యం

బుచ్చెయ్యపేట: రబీ ధాన్యం కొనుగోలు కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుపై అనాసక్తి ప్రదర్శిస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్మి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో కస్పా పొలాల్లోనే సుమారు 1600 ఎకరాల్లో రబీ వరి పంట సాగు చేపట్టారు. పెద్దేరు రిజర్వాయర్ నీరు ద్వారా కస్పా పొలాల్లో రెండో పంటగా వరి సాగు చేపడుతున్నారు. వడ్డాది, చిన అప్పన్నపాలెం, దిబ్బిడి, పోలేపల్లి, గౌరీపట్నం, బంగారుమెట్ట, ఎల్బీ పురం, బుచ్చెయ్యపేట తదితర గ్రామాల రైతులకు కస్పా పొలాలు ఉన్నాయి. కస్పాలోనే సుమారు వెయ్యి మంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో విస్తారంగా వరి సాగు చేస్తారు. గతంలో రెండో పంటను ప్రభుత్వం స్థానిక రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లర్లకు తరలించి కొనుగోలు చేసేవారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రబీ ధాన్యం కొనుగోలుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా బుచ్చెయ్యపేట మండలంలో రైతులు సుమారు ఖరీఫ్‌లో 5,800 ఎకరాలు, రబీలో 2,050 ఎకరాల్లో వరి పంట వేస్తారు. ఎకరాకు 3 నుంచి 4 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. ఏ గ్రేడ్ రకం ధాన్యంను టన్ను రూ. 23,030, బీ గ్రేడ్ రకం ధాన్యం రూ. 23,020కు ప్రభుత్వం కొనుగోలు చేయాలి. కానీ ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రబీలో ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదు. దీంతో పలు గ్రామాల్లో రైతులు ప్రైవేటు డీలర్లకు అమ్ముకుంటున్నారు. టన్ను రూ.19 వేలు చొప్పున విక్రయించడంతో ఎకరాకు రూ.10 నుంచి రూ. 12 వేలు వరకు ఆదాయాన్ని రైతులు కోల్పోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చడానికి పలువురు రైతులు ధాన్యం విక్రయించగా.. పలువురు రైతులు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎదురు చూస్తున్నారు. పండిన ధాన్యంను పొలాల్లోను, ఇళ్ల వద్ద కుప్పలుగా వేసి నిల్వ చేశారు. కొంత మంది రైతులు కోతకొచ్చిన వరి పంటను కోయకుండా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

ప్రైవేటు వ్యాపారికి విక్రయించేశా..



కస్పా పొలాల్లో రెండు ఎకరాల్లో రబీ వరి పంట వేశాను. అప్పులు చేసి రూ. 50 వేలకు పైగా పెట్టుబడులు పెట్టాను. ధాన్యం నూర్పి అమ్మడానికి చూడగా ప్రభుత్వం కొనడం లేదని తెలిసింది. దీంతో తెచ్చిన అప్పులు తీర్చడానికి ప్రైవేటు వ్యాపారికి టన్ను రూ.19 వేలకే అమ్మేశాను. ప్రభుత్వం కొనుగోలు చేసి ఉంటే ఎకరాకు అదనంగా రూ.4 వేలు వరకు కలిసొచ్చేది. మూడు టన్నులు అమ్మగా రూ.12 వేలు ఆదాయాన్ని కోల్పోయాను. – దాడి అప్పారావు, రైతు, బంగారుమెట్ట

గతంలో ఆర్బీకేల ద్వారా విక్రయం



రబీలో మూడెకరాల్లో వరి పంట వేశాను. గతంలో రబీ ధాన్యంను రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లర్లు కొనుగోలు చేసేవారు. ఈ ఏడాది కొనుగోలు చేయడం లేదు. ప్రస్తుతం వరి పంట కోత దశకు చేరింది. సుమారు 12 టన్నులు వరకు ధాన్యం దిగుబడి వస్తాది. ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే ఎకరాకు రూ.4 వేలు చొప్పున రూ.48 వేలు ఆదాయం కోల్పోతాను. ప్రభుత్వంమే ధాన్యంను కొనుగోలు చేయాలి. – కోవెల జనార్దనరావు, రైతు, వడ్డాది

ఆదేశాలు వస్తే కొనుగోలు చేస్తాం...



మండలంలోరబీ వరిపంట ఆశాజనకంగా ఉంది వడ్డాది కస్పా పొలాలతో పాటు బోర్లు కింద, ఇతర నీటి ఆధారాలుఉన్న గ్రామాల్లో జోరుగా వరి కోతలు సాగుతున్నాయి. రబీలో ధాన్యం కొనుగోలు చేయడంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం. ఆదేశాలు వస్తే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటాం. – భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి, బుచ్చెయ్యపేట

రేషన్ కార్డుల నమోదు కోసం పడిగాపులు



వడ్డాదిలో నిరీక్షిస్తున్న ప్రజలు

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో రేషన్ కార్డుల నమోదు కోసం వచ్చిన ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండేళ్ల తరవాత ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల నమోదుతో పాటు పిల్లలు చేర్పులు, మార్పుల కోసం అవకాశం కల్పించింది. వారం రోజులుగా కార్డుల నమోదు కార్యక్రమం జరుగుతున్నా సర్వర్ మాత్రం సహకరించడం లేదు. పది వేల జనాభా ఉన్న వడ్డాదిలో రెండు సచివాలయాలున్నా సిబ్బంది కొరత ఉంది. రెండు సచివాలయాలకు ఒక్కరే డిజిటల్ అసిస్టెంట్ ఉండడంతో ఒక దగ్గరే కార్డుల నమోదు కార్యక్రమం జరుగుతుంది. దీనికి తోడు సర్వర్ తరచూ మొరాయించడంతో కార్డుల నమోదు కోసం పిల్లలతో వస్తున్న ప్రజలు గంటల తరబడి నిలబడి అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ నెలాఖరు వరకే రేషన్ కార్డుల నమోదుకు అవకాశం ఉండడంతో వడ్డాదిలో మరో సెంటర్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన కోదండ రామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న పెద్దలు

చీడికాడ: మండలంలోని ఖండివరంలో కొలువుదీరిన కోదండ రామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా ముగిసింది. గురువారం విఘ్నేశ్వర పూజ నుంచి శుక్రవారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, సర్పంచ్ శిరంరెడ్డి లక్ష్మి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

సరుగుడు సచివాలయం సిబ్బంది ఇష్టారాజ్యం.!

- మధ్యాహ్నం వరకు విధులకు హాజరు కాని వైనం
- గిరిజనులతో కలిసి ప్రజాప్రతినిధుల ఆందోళన



గిరిజనులతో కలిసి ఆందోళన చేస్తున్న సుందరకోట సర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ రాజుబాబు



సరుగుడు సచివాలయంలో కార్యదర్శి రాక ఖాళీగా ఉన్న కుర్చీ

నాతవరం: సరుగుడు సచివాలయంలో సిబ్బంది పని తీరుపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమయ పాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. సరుగుడు సచివాలయం తలుపులు శుక్రవారం తెరిచి ఉంచారు. రెండు పంచాయతీలకు చెందిన గిరిజనులు వివిధ పనులపై సచివాలయానికి వెళ్లగా.. కార్యాలయంలో సిబ్బంది లేరు. సిబ్బంది వస్తారని సచివాలయం వద్ద మధ్యాహ్నం వరకు గిరిజనులు వేచి ఉన్నారు. గంటల తరబడి నిరీక్షించినా ఫలితం లేదు. అదే సమయంలో సుందరకోట సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండపల్లి రాజు, సరుగుడు మాజీ సర్పంచ్, టీడీడీ నాయకుడు పట్టెం రాజుబాబు సచివాలయానికి పని మీద వచ్చారు. గిరిజనులతో కలిసి వారు కూడా సచివాలయం బయట సిబ్బంది కోసం నిరీక్షించారు. ఎంతసేపటికి సిబ్బంది రాకపోవడంతో సచివాలయానికి తాళాలు వేయాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ కార్యాలయం తాళాలు వేయకూడదనే ఉద్దేశంతో సచివాలయం వద్ద గిరిజనులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వపరంగా ఏపని కావాలన్నా సచివాలయంలోనే జరుగుతుందన్నారు. సరుగుడు సచివాలయంపై ఆధారపడి సుందరకోట పంచాయతీ శివారు అసనగిరి, ముంతమామిడిలోద్దు, తోరడ, కొత్త సిరిపురం, బమిడికలోద్దు, కొత్త దద్దుగుల, పాత సిరిపురం, రామన్నపాలెం, అచ్చంపేట, రాజవరం, దద్దుగుల, మాసంపల్లి, యరకంపేట మొత్తం 16 శివారు గ్రామాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల గిరిజనులు ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులు, పేర్లు మార్పులు, చేర్పులు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు కోసం సచివాలయానికి వస్తున్నారన్నారు. అయితే సచివాలయానికి సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్లిపోతున్నారో తెలియని పరిస్థితులు ఉన్నాయన్నారు. గతంలో చాలా సార్లు ఇలాంటి పరిస్థితులు ఎదురు కావడంతో ఎంపీడీవోకు ఫిర్యాదు చేద్దామని వెళ్లామన్నారు. అయితే ఇప్పుడు కలెక్టరుకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్టు వారు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయాల పనితీరు చాలా బాగుండేదని, ఇప్పుడు పర్యవేక్షణ కొరవడడంతో దయనీయంగా తయారైందని గిరిజనులు చర్చించుకున్నారు.

సాదాసీదాగా రావికమతం మండల సమావేశం



అధికారులను ప్రశ్నిస్తున్న మత్స్యవానిపాలెం సర్పంచ్ గణేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకన్నబాబు

రావికమతం: ఉపాధి హామీ పథకంలో ఆరు రోజులు పని చేస్తే నాలుగు రోజులు మస్తర్లు వేయడంతో పాటు విద్యా, విద్యుత్ సమస్యలపై అధికారులను పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు అయ్యారు. వారంలో ఆరు రోజులు పని చేస్తే నాలుగు రోజులు పనికి వచ్చినట్లు మస్తర్లు వేయడం ఏమిటని మేడివాడ ఎంపీటీసీ సభ్యుడు సత్యప్రసాద్ ఎంపీడీవో, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులను ప్రశ్నించారు. ఇకపై అలా జరగకుండా చూస్తామని అధికారులు వివరణ ఇచ్చారు. మత్స్యవానిపాలెం పాఠశాలలో గతంలో 108 మంది వరకు విద్యార్థులు ఉండేవారని, పాఠశాల విలీనంతో విద్యార్థులు తగ్గిపోయారని సర్పంచ్ గణేష్ తెలిపారు. అలాగే సర్పంచ్‌లకు ప్రభుత్వ పథకాల గురించి చెప్పకపోవడానికి గల కారణాలు తెలియజేయాలని ఆయన నిలదీశారు. రావికమతం సినిమా హాలు దగ్గర కేబుల్ వైరుతో సమస్య ఉన్నా సరిచేయడం లేదని సర్పంచ్ మోదినాయుడు చెప్పారు. కీలక శాఖ అధికారులు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచుల గైర్హాజరుతో శాఖల వారీగా పూర్తి స్థాయిలో చర్చ జరగకుండా సాదాసీదాగా సమావేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దంట్ల వెంకటరమణ, భవానిప్రసాద్, ఎంపీడీవో వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో మొరాయిస్తున్న సర్వర్లు



దేవరాపల్లి సచివాలయం-2లో సర్వరు పనిచేయక నిరీక్షిస్తున్న ప్రజలు

దేవరాపల్లి: దేవరాపల్లి శ్రీకృష్ణాలయానికి ఆనుకొని ఉన్న సచివాలయం-2లో తరచూ సర్వర్లు మొరాయిస్తుండడంతో ఆన్‌లైన్ సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రజలు సచివాలయాల్లో గంటల కొద్దీ నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం ఆన్‌లైన్ సేవలు కోసం వచ్చిన పలువురు ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. సచివాలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహనతోనే డెంగ్యూ నివారణ



మాకవరపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



రోలుగుంటలో వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యురాలు ధనలక్ష్మి



కె.జె.పురంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి ప్రసాదపాత్రుడు



కొత్తకోటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



దేవరాపల్లిలో అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ వనజ, వైద్య సిబ్బంది



కంతారం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం: అవగాహనతో డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని వైద్యాధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ నివారణ అందరి బాధ్యతంటూ ప్రతిజ్ఞ చేశారు. ప్రధానంగా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిల్వ నీరు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని, లేకుంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోలుగుంట: రోలుగుంటలో పీహెచ్‌సీ వైద్యురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించరాఉ. పీహెచ్‌సీ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఆర్అండ్‌బీ రోడ్డు మీదుగా హనుమాన్ గుడి వద్దకు వెళ్లి, అక్కడి నుంచి తిరిగి పీహెచ్‌సీ చేరుకుంది. అనంతరం డెంగ్యూ నివారణకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఎంపీహెచ్‌ఈవో కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు షాజహాన్, వరహాలమ్మ, ఎల్టీ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదపాత్రుడు ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుజాత, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శశిప్రియాంక, ఆయుష్ వైద్యాధికారి చంద్రవదన, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, పీహెచ్ఎన్ ప్రమీలా పాల్గొన్నారు. ఎ.కోడూరు ఆరోగ్య ఉప కేంద్రం వద్ద హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు జి.లక్ష్మి, బి.శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: కొత్తకోట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డెంగ్యూ వ్యాధిపై వైద్యాధికారి రజిని అవగాహన కల్పించారు. ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీగా బయలు దేరి కొత్తకోట మెయిన్ రోడ్డు కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. డెంగ్యూ లక్షణాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా దేవరాపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఈ.పూజ్యమేఘన, డి.వజన మాట్లాడుతూ డెంగ్యూ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపైన ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ ర్యాలీలో హెల్త్ సూపర్‌వైజర్ కె.పుష్పరాజ్, స్టాఫ్ నర్స్ రాణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాతవరం: మండల కేంద్రం నాతవరంలో శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గొలుగొండ: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కంతారం గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎ.కోడూరులో ర్యాలీలో పాల్గొన్న హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, తదితరులు




లంకవానిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి శైలజ, తదితరులు



నాతవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సత్యవరంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు



విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న ట్రాన్స్‌కో సిబ్బంది

మాడుగుల: మండలంలోని సత్యవరం గ్రామంలో గురు వారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురుగాలు ధాటికి పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామమంతా అంధకారంలో ఉంది. కాగా శుక్రవారం ఉదయం నుంచి విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు.

ఉత్తమ ప్రకృతి వ్యవసాయ రైతులకు సన్మానం

రావికమతం: రావికమతంలో సేంద్రియ వ్యవసాయం, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై గెంజి వారి రామాలయం వద్ద శక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ తోటి రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు తెలియజేస్తున్న ఇద్దరు రైతులు గెంజి ప్రసాదరావు, గెంజి సత్యనారాయణను గ్రామ సర్పంచ్ మోదినాయుడు, సన్యాసినాయుడు, నవర శ్రీనివాస్ , ప్రకృతి వ్యవసాయ అధికారులు నాగేశ్వరరావు, త్రిమూర్తులు సన్మానించారు.